www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 16 ఏప్రిల్ 2025

5

తిరుపతి



### విజిలెన్స్ అదుపులో.. 'డ్రోన్' ఎగరేసిన యూట్యూబర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అన్షుమన్ తరెజా అను ఓ యూట్యూబర్ మంగళవారం సాయంత్రం శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న హరినామ సంకీర్తన మండపం వద్ద డ్రోన్ ఎగురవేసినట్లు టీటీడీ విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అతనిని అదుపులోకి తీసుకుని డ్రోన్ స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చాపకింద నీరులా...

ఆన్‌లైన్‌కే పరిమితమైన పోలీసులు

ఆఫ్‌లైన్‌లోనూ లావాదేవీలు

ఇప్పటికీ ..చేసిన తప్పులకు చెల్లింపులు

అయ్యయ్యో.. చేతిలో డబ్బులు పోయేనే.. అయ్యయ్యో జేబులు ఖాళీ ఆయెనే.. ఐపిఎల్ మ్యాచ్ వచ్చింది.. కాసుల ఆశ చూపింది.. బెట్టింగ్ గ్యాంగ్ మాయ మాటలకు పరువు కాస్తా పోయింది.. అయ్యయ్యో..

# యధేచ్ఛగా ఐపిఎల్ బెట్టింగ్

ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో

వేసవి వచ్చిందంటే చాలు ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్లతో వినోదాన్ని అందుకునే వారు కొందరైతే, ఇదే అదునుగా మరికొంతమంది అత్యాశపడే అమాయక ప్రజల నుండి బెట్టింగుల పేరుతో లక్షల రూపాయలు దండుకుంటుంటారు. ఐపీఎల్ మొదలైనప్పటి నుండి చిన్న చిన్నగా మొదలైన ఈ బెట్టింగులు నేడు కుటుంబాలను ఛిద్రం చేసి, ఆ కుటుంబ సభ్యుల బలవన్మరణాలకు కారణం అయ్యే స్థాయికి ఎదిగిపోయాయి. ఇండియన్ ప్రీమియర్ లీగ్ కోసం దేశంలోని పారిశ్రామిక దిగ్గజాలు సైతం ఈ మ్యాచ్ నిర్వహణకు కోట్ల రూపాయలు వెచ్చిస్తాయి. బెట్టింగ్ ముసుగులో ధనికుల నుండి మధ్యతరగతిలో ఉన్న అమాయక ప్రజల వరకు వందల నుండి మొదలై లక్షల రూపాయలు ఒక్కో మ్యాచ్ కు బెట్టింగులు కాచి బుకీగా ఉన్న వ్యక్తి మధ్యవర్తిగా ఉంటూ తన కమీషన్ పోను గెలిచిన వారికి బెట్టింగ్ కాచిన నగదును చెల్లిస్తున్నారు. ఈ బెట్టింగులతో గొడవలు పడి పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేయించుకున్న వారు కొందరైతే, అక్కడినుండి కోర్టులో శిక్షలకు వెళ్లినవారు మరికొందరు. కొన్ని కుటుంబాల్లో పరువు పోతుందని ఇంటిలో తమ బిడ్డ చేసిన పనికి బెట్టింగ్ బ్యాచుల నుండి బెదిరింపులు వస్తుంటే బిడ్డను కాపాడుకోవడానికి ఆస్తులను అమ్మి కట్టిన వారు కొందరైతే, వాయిదాలు తీసుకుని రెండేళ్లుగా కంతులు చెల్లిస్తున్న వారు మరికొందరు ఉన్నారు. ముఖ్యంగా తిరుపతి నగర పరిధిలోనే కాకుండా మంగళం శివారు బిటిఆర్ కాలనీలో కూడా బెట్టింగులు జోరుగా సాగుతున్నాయని సమాచారం.

**ఆన్ లైన్ కే పరిమితమైన పోలీస్ శాఖ.....**

ఐపీఎల్ ప్రారంభంలోనే జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఐపిఎల్ బెట్టింగులు కాస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే పోలీసు శాఖ ఆన్ లైన్ బెట్టింగ్ యాప్ లపై పూర్తిగా దష్టి సారించిందనే చెప్పాలి. కానీ పోలీసుల కళ్ళుగప్పి తమ కార్యకలాపాలను ఎలా చక్కదిద్దుకోవాలి అనే కోణంలో ఆలోచించిన బెట్టింగ్ రాయుళ్లు గ్రూపులుగా ఏర్పడి ఓ వ్యక్తిని బుకీగా నిర్ణయించుకుని అక్కడే తమ బెట్టింగ్ ను కాని చేస్తున్నారు. వారు ఏదైతే ఎంచుకొని బెట్టింగ్ కాస్తారో అది పూర్తయిన తరువాత నగదు చెల్లింపు ఆన్ లైన్ పద్ధతిలో కాకుండా నగదు రూపంలో, వస్తువు రూపంలో ఇస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**ఇక ఆఫ్ లైన్ బెట్టింగ్ కు వస్తే.....**

ఆన్ లైన్ బెట్టింగులపై పోలీసు శాఖ పూర్తిగా దష్టి సారించిందని గ్రహించిన బుక్కీలు ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా గ్యాంగ్ గా ఏర్పడి బెట్టింగులు చేసుకుంటే ఎటువంటి ప్రమాదం ఉండదని, ప్రాంతాలవారీగా విడిపోయి చిన్నపాటి గ్రూపులుగా ఏర్పడి సెల్ ఫోన్ల ఆధారంగా మ్యాచ్ ను తిలకిస్తూ టాస్ పై, ఐదు ఓవర్లకు ఇన్ని వికెట్లు, ఇన్ని ఓవర్లకు ఆల్ అవుట్ , నాలుగు కొట్టాడంటే, ఆరు కొట్టాడంటే ఇలా బుకీలు అందుబాటులో ఉంచిన దానిని ఎంచుకొని దానిపై బెట్టింగులు కాస్తున్నట్లుగా తెలుస్తోంది. పోలీసు శాఖ ఆన్ లైన్ పై దృష్టి ఉంచగలిగిందే కానీ, ఈ ఆఫ్ లైన్ లో జరిగే బెట్టింగులను గుర్తించలేక పోతోంది అన్నది వాస్తవం.

**చిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు.....**

సరదా కోసమో, స్వల్ప కాలంలో రెట్టింపు డబ్బులు సంపాదించాలి అనే అత్యాశకు పోయి మధ్యతరగతి ప్రజలతో పాటుగా వ్యాపారవేత్తలు, చిన్నపాటి పనులు చేసుకునే వారు కూడా ఈ బెట్టింగ్ లపై మక్కువ చూపుతున్నారు అన్నది వాస్తవం. కొన్ని వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే మంగళం పరిధిలో రోజువారి వ్యాపారం చేసుకుంటున్న ఓ కుటుంబం ఆ కుటుంబంలోని యువకుడు చేసిన తప్పిదానికి నేటికీ వాయిదాల పద్ధతిలో బెట్టింగ్ గ్యాంగ్ కు డబ్బులు చెల్లిస్తూనే ఉన్నారు. మొదట్లో బెట్టింగ్ లో ఓడిపోయిన అతని ఇంటి వద్దకు బుక్కి గ్యాంగ్ వచ్చి హల్చల్ చేశారు. దీంతో భయపడిపోయి పరువు పోతుందనే ఉద్దేశంతో వారిని బతిమలాడుకుని వాయిదాల పద్ధతిలో ఆ గ్యాంగ్ కు డబ్బు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ఇవే కాకుండా పదుల సంఖ్యలో యువకులు ఇలా స్నేహితులతో కలిసి బెట్టింగులు కాస్తూ అప్పుల పాలు అయిన పరిస్థితులు తిరుపతి నగరం తో పాటు మంగళం లో కూడా కనిపిస్తున్నాయి. గంటల కాలం జరిగే ఓ క్రికెట్ మ్యాచ్ కు జీవితాలను పణంగా పెట్టే ఆలోచనలను ఇకనైనా యువత విడనాడాల్సి ఉంది. ఇదే సమయంలో ప్రభుత్వాలు కూడా ప్రజల ఆర్థిక జీవన ప్రమాణాలను పెంచే దిశలో తప్పు దోవపడుతున్న కొంతమంది భరతం పట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇందులో పోలీసు శాఖనే బాధ్యులుగా చేస్తే అది తప్పదమే అవుతుంది. నష్టపోయిన వారు ధైర్యమెంచి పోలీస్ స్టేషన్ గడప తొక్కుతారు. మరికొందరు పరువు పోతుందని ప్రాణాలు తీసుకుంటున్నారు... ఆస్తుల అమ్ముకుంటున్నారు... పూర్తిస్థాయిలో బెట్టింగ్ రాయుళ్ల ఆటలు కట్టించడానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

# మా బడి మాకు కావాలి

**'పల్లమాల'కు మా పిల్లల్ని పంపించం / కాటూరు గ్రామస్తుల నిరసన**

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ

'మా బడి మాకు కావాలి' అంటూ కాటూరు గ్రామస్తులు మండలంలోని ఎంపియుపి స్కూలు ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం పెట్టి 'ప్రభుత్వం వారు పిల్లల విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కాటూరులో ఉన్న యుపి స్కూలును మోడల్ ప్రైమరీ స్కూలుగా మారుస్తున్నారని, ఇక్కడ ఉన్న 6, 7, 8 తరగతుల పిల్లలను పల్లమాల జిల్లా పరిషత్ హైస్కూల్లో కలిపారని, వారికి వెళ్లి రావడానికి బస్సు ఛార్జీలకు ప్రభుత్వం డబ్బులు ఇస్తుందని, ఇందుకు మీరు అంగీకరిస్తున్నట్లు సంతకాలు పెట్టి ఇవ్వాలి' అని తమను బలవంతం చేస్తున్నారని వాపోయారు. తల్లిదండ్రుల కమిటీ తరపున తాము తిరస్కరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ తమ పాఠశాలలో 115 మంది పిల్లల ఉన్నారని, 6, 7, 8 తరగతులు చదివే పిల్లలు 50 మంది ఉన్నారన్నారు. వచ్చే సంవత్సరానికి 70 మందికి పైగా పిల్లలు 6, 7, 8 తరగతుల్లో ఉంటారన్నారు. కావున తమ పాఠశాలను హైస్కూలుగా మార్పు చేయాలని తల్లిదండ్రుల కమిటీ నిర్ణయించింది. ప్రైమరీ పాఠశాలగా చేస్తే తాము ఎటువంటి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. బడికి బీగాలు వేసి రోడ్లోకి వచ్చి ధర్నా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. తమ పిల్లలు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లమాల పాఠశాలకు వెళ్లాలంటే కిలోమీటర్ దూరం నడిచి రోడ్డులోకి వెళ్లాలి. అక్కడ బస్సు ఎక్కి పల్లమాలలో దిగి రోడ్డు దాటి హైస్కూలుకు వెళ్లాలన్నారు. సాయంత్రం మళ్లీ పల్లమాల హైస్కూలు వద్ద బస్సు ఎక్కి కాటూరు రోడ్డు దిగి, రోడ్డు దాటి కిలోమీటర్ దూరం నడిచి ఊళ్లోకి రావాలన్నారు. ఇన్ని ఇబ్బందులు పడి తమ పిల్లల్ని పంపించడం ప్రమాదకరమని వాపోయారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ పల్లమాల హైస్కూలుకు తమ పిల్లల్ని పంపలేమన్నారు. అధికారులు స్పందించి తమ పాఠశాలను యుపి పాఠశాలగా ఉంచాలని, లేదా హైస్కూలుగా చేయాలని, ప్రైమరీ పాఠశాలగా చేస్తే మాత్రం సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ మేకల. మురళి , గ్రామ ఉపసర్పంచ్ కాటయ్య, గ్రామ పెద్దలు హేమచంద్ర రెడ్డి , కష్ణమూర్తి , ధనంజయులు , బతెయ్య , మురళి , మోద్దీన్ బాషా తల్లిదండ్రులు రమేష్, వెంకటేశ్వర్లు, ప్రశాంతి, సుజాత, మునెమ్మ, ఉమామహేశ్వరి, హారతి, శ్రీలేఖ, సుధాకర్, భాస్కర్, కుమార్, మాధవి, అనూష మొదలైన వారు పాల్గొన్నారు.

బడి మూసేస్తే పోరాటం చేస్తామని ప్రకటించిన కాటూరు గ్రామస్తులు

## మొక్కలు నాటకనే నాటినట్లు...

# ఇష్టారాజ్యంగా 'పే'మెంట్లు

**'ఉపాధి' ఎపిఒపై పీడీ శ్రీనివాస ప్రసాద్ ధ్వజం / సామాజిక తనిఖీల్లో రూ.4 లక్షల 50వేలు అవినీతి**

ప్రజాశక్తి - కోట

'ఉద్యోగం వద్దనుకుంటే వదులుతామా..? ఆర్ ఆర్ యాక్ట్ కింద రికవరీ చేస్తాం..' అంటూ కోట ఎపిఒపై జిల్లా పీడీ శ్రీనివాసప్రసాద్ ధ్వజమెత్తారు. 400 మొక్కలు నాటకనే నాటినట్లు పేమెంట్లు డ్రా చేశారని మండిపడ్డారు. ఉపాధి హామీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. సామాజిక తనిఖీల్లో దాదాపు 4 లక్షల 50వేలు అవినీతి జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. ఉపాధి హామీ పనులపై మంగళవారం సామాజిక తనిఖీని కోట ఎంపిడిఒ కార్యాలయంలో జరిగింది. పీడీ శ్రీనివాస ప్రసాద్, గూడూరు ఎపిడి వరప్రసాద్ హాజరయ్యారు. ఇటీవల ఉపాధి హామీ కార్యాలయంలో ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు, ఒక సిఇఒ బదిలీపై వెళ్లారు. మంగళవారం జరిగిన సామాజిక తనిఖీలను పరిశీలిస్తే...

అవకతవకలపై ఏపీఒను ప్రశ్నిస్తున్న పీడీ

మండలంలో 21పంచాయతీలు ఉన్నాయి. ప్రింటెడ్ రిజిష్టర్లు ఉపయోగంలో లేకపోవడం, అత్యధికంగా నేమ్‌బోర్డులు, మస్టర్లు, జాబ్‌కార్డులు లేవని బహిరంగంగా నిర్ధారణ డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లు పీడీకి తెలిపారు. పలు పంచాయతీల్లో మొక్కలు నాటకుండానే గుంటలు చూపించి నగదు స్వాహా చేశారని తనిఖీల్లో బయటపడింది. ప్రీ మెజర్మంట్ చేయకనే పేమెంట్ బిల్లులు చేశారని డిఆర్‌పిలు పీడీకి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. వర్కుఫైల్స్ అసంపూర్తిగా ఉన్నాయి. మస్టర్లలో కూలీల సంతకాలు లేవు. కొన్ని మస్టర్లలో సంతకాలు ఒకటిగానే ఉన్నాయని గుర్తించారు. రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించడం లేదని బయటపడింది. పంచాయతీల్లో జరిగిన అవకతవకలకు ఎపిఒ, టిఎ, ఎఫ్ఎలు పూర్తి బాధ్యత వహించాలన్నారు. బాధ్యులు ఎంతటివారైనా రికవరీ కట్టాల్సిందేనని పీడీ తెలిపారు. ఓ పంచాయతీలో 26 పనులకు ఒక పనికి మాత్రమే చెక్ మెజర్మెంట్ చేశారని డిఆర్‌పిలు తెలిపారు. 400 మొక్కలు నాటకనే నాటారని పేమెంట్ ఇచ్చారు. పేమెంట్ చేసే ముందు ప్రీ మెజర్మెంట్ చేయాల్సి ఉంది. ఏదిఏమైనా మండలంలో పెద్ద మొత్తంలోనే పనులు చేయకనే నిధులు స్వాహా చేసినట్లు డిఆర్‌పిలు పీడీ దృష్టికి తీసుకొచ్చారు. పీడీ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీల్లో ఆరా తీశామని, పనులు చేయకనే చేసినట్లు పేమెంట్ జరిగిందని, బాధ్యులైన ఎపిఒ, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, సిఇఒల ద్వారా రికవరీ చేస్తామన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు ఇద్దరిని సస్పెండ్ చేశామన్నారు. వారం రోజుల్లో ఉపాధి కార్యాలయంలో ప్రక్షాళన చేసి చూపిస్తామని అందరి సమక్షంలో పీడీ తెలిపారు. ప్రతి పంచాయతీలో కూలీలకు పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి సిబ్బంది బాధ్యతాయుతంగా ఉద్యోగం చేయాలని, లేదంటే ఎలాంటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎపిడి వరప్రసాద్, పంచాయతీరాజ్ ఎఇ కిరణ్, డిఆర్‌పిలు, ఎపిఒ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

## 27న ఎస్వీ పోటు వర్కర్స్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

శ్రీ వెంకటేశ్వర పోటు వర్కర్స్ లేబర్ కాంట్రాక్ట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలు ఏప్రిల్ 27వ తేదీన తిరుమలలో జరగనున్నాయి. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు మేరకు ఎన్నికల అధికారిగా వి.సురేష్ బాబు నియమితులయ్యారు. కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలకు సంబంధించిన పూర్తి వివరాలను మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 471 మంది ఓటర్లు కలిగిన శ్రీ వెంకటేశ్వర పోటు వర్కర్స్ లేబర్ కాంట్రాక్ట్ కో -ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏడుమంది డైరెక్టర్లకు అవకాశం కలిగిన ఈ కోపరేటివ్ సొసైటీ ఎన్నికలకు 17వ తేదీ గురువారం నోటిఫికేషన్ విలువడుతుందని తెలిపారు. ఈనెల 21వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ 22వ తేదీన నామినేషన్ల పరిశీలన, 23వ తేదీ నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని వెల్లడించారు. ఎన్నికల నోటిఫికేషన్ నుంచి అన్ని కార్యక్రమాలు తిరుమలలోని నందకం వెనుక భాగంలో ఉన్న నీలారామ్ బిల్డింగ్స్ లో జరుగుతాయని సురేష్ బాబు పేర్కొన్నారు. నామినేషన్లు ఏడు అంతకన్నా తక్కువ దాఖలు అయితే డైరెక్టర్ల పదవులు ఏకగ్రీవం అవుతాయని తెలిపారు. నామినేషన్ల పరిశీలన అనంతరం ఏడు కంటే ఎక్కువమంది బరిలో ఉన్నట్లయితే ఎన్నికలు అనివార్యం అవుతాయని పేర్కొన్నారు. ఎన్నికల పోలింగ్ మాత్రం టీటీడీ ఎస్వీ హైస్కూల్ లో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

అయితే ఎస్వీ హైస్కూల్లో నిర్వహించేందుకు ఎన్నికల అధికారి సురేష్ బాబు టీటీడీ ఈవో శ్యామల రావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి నుంచి అనుమతి కోరినట్లు తెలిసింది. ఎన్నికల ప్రక్రియ మళ్లీ మరొక నోటిఫికేషన్ తో అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు.

### గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహిద్దాం : కమిషనర్

ప్రజాశక్తి - డెస్క్

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను అద్భుతంగా నిర్వహించేందుకు అందరూ కలసికట్టుగా పని చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం తాతయ్యగుంట గంగమ్మ గుడిలో జాతరకు చేయాల్సిన ఏర్పాట్లపై డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికష్ణ, అన్ని విభాగాల అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. గతంలో ఏర్పాట్లు, ప్రస్తుతం చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు సరఫరా చేయాలని, వాహనాలు పార్కింగ్, క్యూ లైన్ల ఏర్పాటు, భక్తులు పొంగళ్ళు పెట్టుకునేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులు అన్ని ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. అలాగే భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అన్నారు. కమిషనర్ వెంట తాతయ్య గుంట గంగమ్మ గుడి ఈఓ జయకుమార్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్ ఉన్నారు.

# లైన్‌ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

**సీతారాంఏచూరి నగర్‌కు కరెంట్ ఇవ్వాలి / విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సిపిఎం ధర్నా**

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్

దళిత మహిళలను దుర్భాషలాడిన లైన్‌ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. నియోజకవర్గ మండల కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ రెండేళ్లుగా సీతారాం ఏచూరి నగర్‌లో దళిత గిరిజనులు నివాసం ఉంటున్నారన్నారు. రాజకీయ నాయకుల మాట విని లైన్‌ఇన్‌స్పెక్టర్ తమ వద్దకు వచ్చి దళిత గిరిజనులపై దౌర్జన్యానికి పాల్పడుతూ అసభ్య పదజాలంతో తిడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత గిరిజనులకు 200 యూనిట్లు ఉచితంగా ఇస్తామని చెబుతోందని, అయితే ఒక్క బల్బు మాత్రమే ఉన్న తమపై లైన్ ఇన్‌స్పెక్టర్ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి దళిత గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. పేదలకు కరెంట్ సదుపాయం కల్పించి, రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.రాజయ్య, దొరబాబు, వెంకటయ్య, నాగమణి, నాగరాజు, పెంచలయ్య, ఎరుకుల సంక్షేమ సంఘం నాయకులు మురగయ్య, నవీన్ పాల్గొన్నారు.

## 'పత్తిపాటి వివేక్'కు కందుకూరి విశిష్ట పురస్కారం

ప్రజాశక్తి - డెస్క్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సాంస్కతిక కోఆర్డినేటర్ డా.పత్తిపాటి వివేక్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిల్లాస్థాయి కందుకూరి విశిష్ట పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక, సినిమాటోగ్రఫీ శాఖ ఆధ్వర్యంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టీవీ, నాటక రంగా అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతిని పురస్కరించుకుని 2025 వ సంవత్సరానికి గాను "కందుకూరి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారం" లను రాష్ట్రస్థాయి లో ముగ్గురికి, జిల్లాస్థాయిలో 26 జిల్లాలకు గాను 107 మందికి కందుకూరి విశిష్ట పురస్కారాలకు ఎంపిక చేసింది. రాష్ట్రవ్యాప్తంగా రంగస్థల నటుల ప్రతిభను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ విశిష్ట పురస్కారాలను ప్రకటించింది. ఈ పురస్కారాలలో తిరుపతి జిల్లా నుంచి డా.పత్తిపాటి వివేక్ నూ వరించింది. వివేక్ మొదటి నుంచి సాంస్కతిక వేదికల పైన అనేక ప్రదర్శనలు చేసేవారు. ముఖ్యంగా మైమ్ సాంస్కతిక కార్యక్రమం అతనికి వెన్నుతో పెట్టిన విద్య. ఇప్పటికే అనేక పురస్కారాలు, అభినందనలు అందుకున్న ఆయన 2022లో రంగస్థలంకు చెందిన నాటిక రచనకు బంగారు నంది అవార్డు అందుకున్నారు. అటు తర్వాత 2024 లో విశ్వవిద్యాలయ సాంస్కతిక విభాగ కోఆర్డినేటర్ గా నియమితులైన తర్వాత వర్సిటీలో సుదీర్ఘకాలం తర్వాత సాంస్కతిక పోటీలను నిర్వహించారు. అందులోని విజేతలను తన నాయకత్వంలో దక్షిణ భారత విశ్వవిద్యాలయాలలో ఎస్వీయూ ను అగ్రస్థానంలో నిలబెట్టారు. దీని ద్వారా లభించిన అవకాశంతో జాతీయస్థాయి విశ్వవిద్యాలయాలు సాంస్కతిక కార్యక్రమంలో ఎస్ వి యూనివర్సిటీ చరిత్రలో ఓవరాల్ ఛాంపియన్ గా నిలిపాడు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిల్లా స్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అందుకున్నాడు. ఈ కందుకూరి విశిష్ట పురస్కారాలను విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమంలో ఇవ్వనున్నారు. ఈ విశిష్ట పురస్కారంతోపాటు పదివేల రూపాయల నగదు బహుమతిని డా. వివేక్ అందుకోనున్నారు. ఈ సందర్భంగా డా. పత్తిపాటి వివేక్ నూ కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, వర్సిటీ సహ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

### టిటిడి ఎస్టేట్ అధికారిగా సువర్ణమ్మ

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో** తిరుమల తిరుపతి దేవస్థానం ఎస్టేట్ అధికారిగా సువర్ణమ్మను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎండోమెంట్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను టిటిడి ఎస్టేట్ అధికారిగా బదిలీ చేశారు.

## వార్షిక ప్రణాళిక సర్వేను త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - డెస్క్

జీవనోపాదులకు సంబంధించి వార్షిక ప్రణాళిక సర్వేను త్వరగా పూర్తి చేయాలని తిరుపతి జిల్లా సత్యవేడు గ్రామీణాభివద్ధి సంస్థ( వెలుగు) ఏపిఎం డాక్టర్ డాంగే యాదవ్ కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల మహిళా సమైక్య తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ డాంగే యాదవ్ మాట్లాడుతూ జీవనోపాదులు పెంచేలా వార్షిక ప్రణాళిక రూపొందించాలన్నారు. అలాగే బ్యాంకులో తీసుకున్న లింకేజీ రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. దీంతోపాటు సిఐఎఫ్, ఉన్నతి, శ్రీనిధి వంటి రుణాలు గడువుకు లోపు చెల్లించాల్సి ఉందన్నారు. మహిళా రైతు గ్రూపు ఏర్పాటును వేగవంతం చేయాలన్నారు. అలాగే స్వయం ఉపాధిపై ఆధారపడ్డ వారికి 40 వేల రూపాయలు రుణం మంజూరు చేస్తామన్నారు. అలాగే ఈజీ మార్ట్పై కూడా దష్టి సారించాలని ఆయన కోరారు. ఏదేమైనా మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడమే లక్ష్యంగా పనిచేయాల్సి ఉందన్నారు. ఇందుకు అనుగుణంగానే వార్షిక ప్రణాళిక ఉండాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో వెలుగు కోఆర్డినేటర్లు శివకుమార్, పురుషోత్తం, పుల్లయ్య, మధుసూదన్ రెడ్డి, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు కోటీశ్వరి, అకౌంటెంట్ కాంచన పాల్గొన్నారు.

## మారిన ప్లాన్..




## యుద్ధప్రాతిపదికన విస్తరణ

సి.మల్లవరం-గాజులమండ్యం జాతీయ రహదారి విస్తరణ పనులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సి.మల్లవరం- గాజులమండ్యం 71 జాతీయ రహదారి సిక్స్‌లైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వచ్చే ఏడాది జనవరి కల్లా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో నేషనల్ హైవే అథారిటీ మార్చి నెలాఖరుకల్లా పూర్తి చేసేలా యుద్ధప్రాతిపదికన విస్తరణ పనులు చేస్తోంది. సి.మల్లవరం నుంచి గాజులమండ్యం వరకూ ఎనిమిది ప్రాంతాల్లో జంక్షన్లు ఉండడంతో 12 కిలోమీటర్ల మేర ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని నేషనల్ హైవే అథారిటీ ముందు ప్లాన్ గీసింది. అయితే ఈ ప్లాన్‌ను కేంద్ర రహదారుల శాఖ ముందు ఉంచగా వేలకోట్లు ఖర్చవుతున్న నేపథ్యంలో ఆ ప్రతిపాదనను కేంద్రం తిరస్కరించింది. వకుళమాత టెంపుల్, గొల్లపల్లి చెక్‌పోస్టు, అగ్రహారం, తనపల్లి, తిరుచానూరు, కలెక్టరేట్, తూకివాకం జంక్షన్ల వద్ద వాహనాలు దాటేందుకు అక్కడకక్కడ ఫ్లైఓవర్లు నిర్మించి, అక్కడనుంచి సాఫీగా రహదారి నిర్మించాలని కొత్త ప్లాన్‌ను నేషనల్ హైవే అథారిటీ రూపొందించింది. 12 కిలోమీటర్ల పొడవున న్యాయపరమైన సమస్యలు తలెత్తడంతో కోర్టు ద్వారా పరిష్కరించుకుంది. ఈ నేపథ్యంలో ఎక్కడైతే సిక్స్‌లైన్ వస్తుందో, అక్కడంతా బౌండరీ నాటి, అనుగుణంగా రోడ్డుకు ఇరువైపులా 20 జేసీబీలతో చదును చేసింది.అలాగే రోడ్డుకు ఇరువైపులా సిక్స్‌లైన్‌కు అనుగుణంగా రోడ్డుకు సమాంతరంగా ఉండేలా గ్రావెల్ తీసుకొచ్చి నింపింది. యుద్ధప్రాతిపదికన ఈ పనులను చేపట్టారు. ముందు ప్లాన్ ప్రకారం బాలాజీ కాలనీ సమీపంలోని జర్నలిస్టు కాలనీ వద్ద టోల్‌ప్లాజా వస్తుందని అంచనా వేశారు. ఈ మేరకు భూమిని సేకరించారు. బాలాజీ డెయిరీ సమీపంలోనే టోల్‌ప్లాజా రానున్నట్లు సమాచారం. ఏదిఏమైనా జనవరికల్లా పనులు పూర్తయ్యి, మార్చి ఆఖరుకల్లా కేంద్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి నితిన్‌గడ్కరీ చేతుల మీదుగా ఈ రోడ్డును జాతికి అంకితం చేయనున్నారు.

# మంగళంలో రచ్చ.. రచ్చ

- రెండు రోజులుగా పోలీసులకు కునుకు కరువు
- దొంగతనాలు, కొట్లాటలతో తిరుచానూరు స్టేషన్ కిటకిట

**ప్రజాశక్తి-తిరుపతి డెస్క్ :** గత రెండు రోజులుగా మంగళం పరిధిలో పలు సంఘటనలకు సంబంధించి కొట్లాటలు జరుగుతూ తిరుచానూరు పోలీస్ స్టేషన్ కిటకిటలాడుతోంది. మంగళం ప్రాంతం మైగ్రేటెడ్ ఏరియా కావడంతో పోలీసులకు ఇక్కడ లాండ్ ఆర్డర్ కత్తి మీద సాములా మారిందని చెప్పాలి. సోమవారం ఓ స్థల వివాదంలో నెలకొన్న ఘర్షణ గుంపులు గుంపులుగా ఏర్పడి తిరుమల నగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న హరిత కాలనీలో రోడ్డుపై కొట్టుకున్న పరిస్థితి. ఈ కేసు విషయమై తిరుచానూరు స్టేషన్ ముందు కూడా పెద్ద ఎత్తున రెండు గ్రూపులకు సంబంధించిన వారు చేరి అక్కడ బాహాబాయికి దిగడం, పోలీసులు ఎంత వారించినా కూడా వినకపోవడంతో ఇరువర్గాల 24 మందిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసి నోటీసులు ఇచ్చి పంపించిన పరిస్థితి. సోమవారం సాయంత్రం బిటిఆర్ కాలనీలో ఐదు మంది చిన్న పిల్లలు ఇంటిలో చెప్పకుండా పుదుచ్చేరికి వెళ్లిపోయారు. పిల్లలు కనపడకపోవడంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతూ పోలీసులను ఆశ్రయించారు. రాత్రి గస్తీ చేపట్టిన పోలీసులు బిటిఆర్ కాలనీ 20 లైన్ వద్ద ప్రజలు గుమకూడి ఉండడాన్ని గమనించి వారిని ఇళ్లకు వెళ్లాల్సిందిగా ఆదేశించారు. ఎట్టకేలకి పిల్లలు ఇంటికి రావడంతో సమస్య సద్దుమణిగింది. మంగళవారం సాయంత్రం బిటిఆర్ కాలనీ పదవులు ఐదుకు చెందిన సెల్వం అనే వృద్ధుడు తన మొబైల్ ఫోన్లో చిన్న పిల్లలకు అశ్లీల చిత్రాలను చూపుతున్నాడని స్థానికులు గమనించి అతడికి దేహ శుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఇప్పటికీ దీనిపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని వస్తే కేసు నమోదు చేస్తామన్నారు పోలీసులు. ఇక మంగళవారమే మంగళం పరిధిలో రెండు దొంగతనాలు జరిగాయి అని పోలీసులు తెలిపారు. మంగళం పరిధిలో నేరాలు ఆరాలుగా పెరిగిపోతున్న నేపథ్యంలో పోలీసులకు పలు సవాళ్లు ఎదురవుతున్నాయి. దాదాపు 30 వేలకు పైగా ఉన్న జనాభా ప్రాంతంలో ఒక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తే లా అండ్ ఆర్డర్, నేరాల నియంత్రణకు పటిష్టమైన అదుపుకు అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

### గతంలోనే పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు..

తిరుపతి జిల్లా ఎస్పీగా పనిచేసిన జయలక్ష్మి మంగళంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి పంచాయతీ నుండి తీర్మానం కూడా తీసుకొని, పోలీసు హౌసింగ్ ద్వారా నిర్మించడానికి చర్యలు తీసుకున్నారు. కానీ అవి కాగితాలకే పరిమితం అవడంతో పోలీస్ స్టేషన్ ఏర్పాటు గాలిలో దీపంలా మారిపోయింది. అటు తర్వాత అలిపిరి పరిధిలో ఉన్న మంగళం ప్రాంతాన్ని మండలాల పరిధిలో ఉండే పోలీస్ స్టేషన్లకు అనుసంధానం చేయాలన్న ఉద్దేశంతో గత వైసిపి హయంలో మంగళం పరిధిని అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధి నుండి తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకొచ్చారు. మంగళంలో ఉన్న పోలీస్ అవుట్ పోస్ట్ స్థలంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పులివర్తి నాని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు.

### రాత్రిపూట గస్తీని పటిష్టం చేశాం..

మంగళంలో జరుగుతున్న వరుస దొంగతనాలను, ఆకతాయిలా ఆగడాలను అదుపు చేయడానికి మునుపు ఒక ఒక బీట్ కానిస్టేబుల్ తిరిగేవారు, ఇప్పుడు ఇద్దరని నైట్ బీటుకు కేటాయించాం. అలానే మంగళం క్లస్టర్ కు సంబంధించిన ఎస్ఐ జగన్నాథంను అక్కడే ఉంటూ రాత్రిపూట ఆయన గస్తీ చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చాము. త్వరలోనే మంగళం పరిధిలో పటిష్టమైన పోలీసు చర్యలను అమలు చేస్తాం.

- సునీల్ కుమార్, సిఐ తిరుచానూరు పోలీస్ స్టేషన్

# క్రైం న్యూస్

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** సోమవారం అర్ధరాత్రి పుత్తూరు మండలం, పరమేశ్వర మంగళం, సచివాలయం వద్ద నేషనల్ హైవేపై గుర్తు తెలియని వ్యక్తి నడచి వెళ తుండగా, గుర్తు తెలియని వాహన ఢీకొని మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, మృతి దేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి వయసు 60 సంవత్సరాలు ఉంటుందని, ఎత్తు 5.2 అడుగులు ఉంటాడని నలుపు, తెలుపు రంగుల దుస్తులు ధరిచి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు పుత్తూరు సిఐ సురేందర్ నాయుడుకు వివరాలు తెలపాలని కోరారు.

### తిరుమలలో దారుణం
## పార్కింగ్ వివాదంలో దాడి.. డ్రైవర్ మృతి

**ప్రజాశక్తి - తిరుపతి డెస్క్:** తిరుమలలో దారుణం జరిగింది. పార్కింగ్ విషయంలో డ్రైవర్ల మధ్య మొదలైన గొడవ ఓ డ్రైవర్ మరణానికి కారణమైంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. మూడు రోజుల క్రితం పోలీస్ కాంప్లెక్స్ దగ్గర పార్కింగ్ విషయంలో డ్రైవర్ల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో కురబలకోటకు చెందిన శివ అనే డ్రైవర్‌పై ముగ్గురు డ్రైవర్లు దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ శివ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శివతో గొడవపడ్డ ముగ్గురు డ్రైవర్లు తిరుపతి చెందినవారని సమాచారం. డ్రైవర్ శివ మృతితో అతని కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## అడవిలోకి మళ్లించిన ప్లాస్టిక్ పైపులు తొలగింపు

**ప్రజాశక్తి-తిరుపతి డెస్క్:** తిరుపతి రేంజి మంగళం పరిధిలోని వెంకటేశ్వర కాలనీ వద్ద ఓ కుటీర పరిశ్రమ నుండి అడవిలోకి మళ్ళించిన వ్యర్థాల ప్లాస్టిక్ పైపులను తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి సిబ్బందితో కలిసి మంగళవారం తొలగించారు. అడవిలోకి ఎటువంటి వ్యర్థాలకు సంబంధించిన పైపులను మళ్లింపు చేయకూడదని స్థానికంగా ఉన్నవారికి సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### స్పందనకు వందనం
### ప్రజాశక్తి వార్తకు స్పందన
## ఐసిడిఎస్ వద్ద చెట్లు తొలగింపు

**ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్ :** ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం ఐసిడిఎస్ ఆఫీసు ముందు ఆపసోపాలు అని వచ్చిన వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించి, మంగళవారం ఐసిడిఎస్ ఆఫీసు ముందున్న చెట్లను తొలగించారు. స్థానికులు, అంగన్వాడీలు ప్రజాశక్తికి ధన్యవాదాలు తెలిపారు.

## తహశీల్దారును కలిసిన టిడిపి నాయకులు

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో నూతన తహశీల్దారుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన శ్రీదేవిని టిడిపి మండల అధ్యక్షులు సుధాకర్ నాయుడు, సీనియర్ నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. రెవిన్యూ సమస్యలు, ప్రజల సౌకర్యాలపై చర్చించారు.

## శ్రద్ధగా చదువుకోండి : యంఈఓ

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం తెలియజేశారు. మండలంలోని పుట్టేరి, పి.వి. కండ్రిగ ప్రాథమిక పాఠశాలలు, బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అక్రమ రేకుల షెడ్డు తొలగింపు

రేకుల షెడ్డును తొలగిస్తున్న ఆలయ ఈవో నవీన్

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరు, కోనేటి మిట్ట, శ్రీ కోదండ రామాంజనేయ స్వామి దేవస్థానానికి చెందిన స్థలంలో కొంతమంది రేకుల షెడ్డు వేశారు. ఈవో నవీన్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేసి సిబ్బందితో ఆ రేకుల షెడ్డును తొలగించారు. ఆలయానికి ఉన్న 75 అంకణాల స్థలం కోర్టులో వివాదం నడుస్తోంది. ఈ స్థలంలో కొంతమంది రాత్రికి రాత్రే రేకుల షెడ్డు వేశారు. మంగళవారం ఆలయ ఈవో నవీన్ కుమార్ స్థలం వద్దకు చేరుకొని సిబ్బందితో షెడ్డును తొలగించారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి
### పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** పుత్తూరు కోర్టు ప్రాంగణంలో మే 10న జరగబోవు జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎసిని రాఘవేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనము ఆదా అవుతాయన్నారు. లోక్ అదాలత్ తీర్పుకు అప్పీల్ ఉండదని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీసులు, న్యాయ వాదులు లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలన్నారు.

## వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు పంపిణీ

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** వ్యవసాయ ఉపసంచాలకులు రమేష్ రాజు, నగరి శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీతో వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు పంపిణీ చేశారు. మంగళవారం పుత్తూరు మండల వ్యవసాయ కార్యాలయ ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనిముట్లు రైతులకు 50% సబ్సిడీతో సరఫరా చేస్తున్నామని తెలిపారు. అనంతరం రైతులకు కల్టివేటర్లు, స్ప్రేయర్లు, ఇతర పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గణేష్, వ్యవసాయ అధికారి ఎస్ కోదండయ్య, వడమాలపేట వ్యవసాయ అధికారి విజయ్ కుమార్, వ్యవసాయ సహాయకులు మురళి, రైతులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరు, వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద మంగళవారం రైతులకు ప్రభుత్వం ద్వారా

సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 103 పరికరాలు అందిస్తున్నామని తెలిపారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ రైతులు పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు నాయకులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, శివకుమార్, రమేశ్, మట్టం శ్రావణి రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, కిషోర్ నాయుడు, రైతులు పాల్గొన్నారు.

## జీవనోపాధుల కల్పనే లక్ష్యం

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** బుచ్చినాయుడు కండ్రిగ మండలం వెలుగు కార్యాలయంలో మంగళవారం మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఏపియం మునెయ్య మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాల సభ్యులు వారిగా ఏ నెలలో లోన్ వస్తుంది, అది ఏ కార్యక్రమానికి ఉపయోగించాలి అనే విషయంపై గ్రామ సంఘాల ఋణం, జీవనోపాధి ప్రణాళిక తయారు చేయడం జరిగిందని తెలిపారు. తీసుకునే రుణాలతో జీవనోపాధి కల్పన లక్ష్యంగా పనిచేయాలన్నారు. రికవరీ కూడా 100 శాతం, పుస్తక నిర్వహణ ఉండేలా చూడాలన్నారు. సభ్యుల ముఖ హాజరును త్వరలో ప్రభుత్వ ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసిలు వెంకటరత్నం, శ్రీనివాసులు, అకౌంటెంట్ హిమగిరిజ, మండల సమాఖ్య లీడర్లు శ్వేత, భారతి, లావణ్య గ్రామ సమాఖ్యల లీడర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విజయశ్రీకి స్వల్ప గాయాలు

**ప్రజాశక్తి - తిరుపతి డెస్క్:** శ్రీకాళహస్తిలో స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి వేడుకలకు హాజరైన సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అక్కడ స్వల్పంగా గాయాలయ్యాయి. అమె ఎంజిఎం ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని నాయుడుపేటకు చేరుకున్నారు.

## మా నాయకులను దూషిస్తే ఊరుకోం

**లిప్రజాశక్తి - నాయుడుపేట:** టిడిపి నాయకులు విలువలు మరిచి మా నాయకులను అకారణంగా దూషిస్తున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయుడుపేట వైసీపీ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో టిడిపి నాయకులపై చర్యలు తీసుకోవాలంటూ వినత పత్రం ఇచ్చారు. వైసీపీ పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి కొంతమంది నాయుడుపేట వైసీపీ నాయకులతో కలిసి నాయుడుపేట పట్టణ సీఐ బాబీకి టిడిపి నాయకులు చర్యలు తీసుకోవాలంటూ వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ నాయకులను టిడిపి నాయకులు దూషిస్తూ విలువలు మరచి, జుగుప్సాకరమైన కార్యక్రమాలకు పాల్పడుతున్నారని అలాంటి వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల ప్రతిపక్షంలో ఉండి రాష్ట్రాన్ని పాలించి, పేద ప్రజల పురోగతికై ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిపై అలాగే మంత్రులు ఆర్కే రోజా, విడుదల రజనీ ఫోటోలను మార్ఫింగ్ చేస్తూ వికృత చేష్టలకు పాటుపడుతున్నారని టిడిపి అగ్ర నాయకులు కొంతమందిని ఇలాంటి వాటికోసం వినియోగిస్తూ తమ మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్నారని ఇది ఇలాగే కొనసాగితే ఊరుకునేది లేదని దీనిపై ఎంత దూరమైనా వెళ్ళేందుకు వెనకాడమని బోమని అన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి ఇలాంటి వారిని కట్టడి చేయాలని ఈ విషయమై త్వరలోనే జిల్లా ఎస్పీని కూడా కలవనున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ఒట్టూరు.కిషోర్ యాదవ్,పట్టణ వైసీపీ నాయకులు కటకం. జయరామయ్య,మహిళా కార్యదర్శి ఈదా రత్నశ్రీ, కౌన్సిలర్లు ధారా రవిబాబు, పాలేటి నాగార్జున మరి కొంతమంది నాయకులు పాల్గొన్నారు.

## రీసర్వేతో భూసమస్యలు పరిష్కారం

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ :** భూముల రీ సర్వేతో భూసమస్యల పరిష్కారం అవుతాయని, రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శ్రీదేవి పేర్కొన్నారు. మంగళవారం తిమ్మ భోపాలపురంలో రెవెన్యూ అధికారులు భూముల రీసర్వేకు సంబంధించి గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిమ్మ బోపాలపురంలో మొత్తం 386.78 ఎకరాలుండగా, ఇందులో పట్టా భూములు 263.60 ఎకరములు, ప్రభుత్వ భూములు 123.18 ఎకరములు ఉన్నాయని తెలిపారు. ఈ భూమిలో మొత్తం సర్వే నంబర్లు 56 మాత్రమే, మొత్తం సర్వే నంబర్లకు గాను సబ్ డివిజన్ 909 ఉన్నాయని, ఇందులో గవర్నమెంట్ ఖాతాలో 9, నేషనల్ ఖాతాలో 76 కాబట్టి వచ్చే వారం నుండి ఆ గ్రామంలో రీ సర్వే మొదలవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్, డిటీ చంద్రబాబునాయుడు, ఆర్ఎ నల్లయ్య, సర్వేయర్ రాజ్కుమార్, విఆర్‌లు పాల్గొన్నారు.

## రిటైర్మెంట్ వయసు 62కు పెంచాలి

**ప్రజాశక్తి - తిరుపతి డెస్క్:** ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ ఇటీవల చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, రిటైర్మెంట్ వయసు 62కు పెంచాలని, రిటైరయిన పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, రిటైర్ అయిన తర్వాత వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, గ్రాడ్యుటి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ప్రసాద్, పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, సుబ్బరత్నమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని నారాయణ స్కూల్ సీజ్

**ప్రజాశక్తి - తిరుపతి డెస్క్ :** మంగళవారం తిరుపతి, న్యూ బాలాజీ కాలనీలో అనుమతి లేకుండా నడుపబడుతున్న నారాయణ పాఠశాలను సీజ్ చేయాలని పాఠశాల భవనం ఎదుట ఎన్ఎస్‌యుఐ, జిఐఎన్ఎస్, ఎన్ఎల్ఎస్ఎ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా కమర్షియల్ భవనంలో గత 6 నెలల నుండి నారాయణ పాఠశాల నడిపిస్తున్నారన్నారు. ఈ విషయమై డిఈఓకు ఫిర్యాదు చేయగా, ఆయన డిప్యూటీ డిఈఓ బాలాజీని పరిశీలనార్థం పంపడం జరిగిందని తెలిపారు. రికార్డులన్నీ పరిశీలించగా ఆ స్కూలుకు సంబంధిత పత్రాలు ఏమీ లేక పోవడంతో పాఠశాలను సీజ్ చేశారన్నారు. నారాయణ యాజమాన్యం వివిధ పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. వారి సంస్థలో పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను ప్రింట్ చేసి వేలాది రూపాయలకు అమ్ముతున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోవడం, నాణ్యమైన విద్యని అందించకపోవడం, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయకపోవడం, కమర్షియల్ బిల్డింగ్‌లో పాఠశాల నిర్వహించడం చాలా దారుణమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నారాయణ పాఠశాలను సీజ్ చేసినందుకు డీఈఓ, డిప్యూటీ డీఈవోలకు ధన్యవాదాలు తెలియజేశారు. నారాయణ విద్యాసంస్థల దోపిడీపై భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు బాలాజీ, జిఐఎన్ఎస్ నాయకులు చంద్రనాయక్, కుమార్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృత వర్సిటీలో 'హిందీ' వర్కుషాపు

**ప్రజాశక్తి - తిరుపతి డెస్క్ :** జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో హిందీ విభాగం అధ్యాపకులు డా.వేద ప్రకాష్ బోర్కర్ ఆధ్వర్యంలో "హిందీ భాష, కార్యలలీయ ప్రశాసనములు, హిందీపైన మెలకువలు" అనే అంశం పైన ఒకరోజు వర్క్ షాప్‌ను మంగళవారం నిర్వహించారు. విశ్వవిద్యాలయ విసి ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి ఆయోజకులైనటువంటి డా.వేద ప్రకాష్ బోర్కర్‌ను అభినందించారు. వర్క్ షాప్‌లో పాల్గొన్నవారికి ప్రమాణ పత్రాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలోని బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన

**ప్రజాశక్తి - తిరుపతి డెస్క్:** వంటనూనె మంటలను ఆర్పడానికి తడి రసాయన అగ్నిమాపక యంత్రాన్ని ఉపయోగించాలని తిరుపతి జిల్లా సత్యవేడు అగ్నిమాపక కేంద్ర ప్రధాన అధికారి రాజయ్య చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోనే శ్రీకాళహస్తి బస్టాప్, రిలయన్స్ మార్ట్ ప్రాంతాల వద్ద ఆయిల్ ఫైర్స్, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూనె, గ్రీజు వంటి మండే ద్రవాలు మంటలు ఆర్పడానికి పాన్‌ను ఫైర్ బ్లాంకెట్‌తో కప్పాలన్నారు. ఆయిల్ ఫైర్స్ నివారణపై అగ్నిమాపక సిబ్బంది తడి రసాయన ప్రయోగాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.

## అసాంఘిక పోస్టులపై చర్యలు తీసుకోండి

**ప్రజాశక్తి - తిరుపతి డెస్క్ :**ప్రిస్కిల్లా మండల మహిళ నాయకులు, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న అసాంఘిక పోస్టుల ప్రచారంపై చర్యలు తీసుకోవాలని మంగళవారం పెళ్లకూరు ఎస్ఐకి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సోషల్ మీడియాని వేదికగా చేసుకుని తెలుగుదేశం పార్టీకి సంబంధించిన సంస్థ ద్వారా వస్తున్న అర్ధనగ్న, సాంఘిక పోస్టర్లు, పెడుతున్న వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ రెడ్డి, బీసీ నాయకులు మోహన్, కృష్ణయ్య, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బస్సు పునఃప్రారంభానికి కసరత్తు



ఆర్‌టిసి తిరుపతి రీజినల్ మేనేజర్ నరసింహులును సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

**ప్రజాశక్తి - పిచ్చాటూరు:** ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గతవారం చేసిన విజ్ఞప్తి మేరకు పిచ్చాటూరు - పెనాలూరు పేట బస్సు పునఃప్రారంబానికి ఆర్టీసీ తిరుపతి రీజినల్ మేనేజర్ నరసింహులు, సత్యవేడు డిపో మేనేజర్ వెంకటరమణలు మంగళవారం సర్వే చేశారు. ఈ క్రమంలో పిచ్చాటూరులో అధికారుల సమీక్షలో ఉన్న ఎమ్మెల్యేను వారు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యవేడు నుండి విజయవాడకు, రాత్రి 8 గంటలకు, సత్యవేడు నుండి తిరుమలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని కోరారు. అలాగే పిచ్చాటూరు, నాగలాపురం బస్టాండు ఆవరణలో సిమెంటు కాంక్రీట్ వేయాలని ఎమ్మెల్యే సూచించారు. సానుకూలంగా స్పందించిన రీజినల్ మేనేజర్ బస్సు సర్వీసులు త్వరలో ప్రారంభిస్తామని, సిమెంటు కాంక్రీట్ వేసేందుకు నిదులు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డీ.ఇలంగోవన్ రెడ్డి, తెలుగుదేశం సీనియర్ నాయకులు జయచంద్ర నాయు డు, వాసు రెడ్డి, భక్తా రెడ్డి, బి.ఎం.దొరై వేలు, రవి, మల్లిఖార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య విద్యార్థులకు అభినందన

**ప్రజాశక్తి - కోట :** జాతీయ స్థాయిలో గుర్తింపును సాధించిన కోట, శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులకు అభినందన సభను జిల్లా ఏ.జి.యమ్ నర్రా శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. అదేవిధంగా నేషనల్ ఒలంపియాడ్ ఎగ్జామ్స్ లో పాల్గొని ఎంపికైనవారిలో 251మంది విద్యార్థులు ఆయా విభాగాలలో బహుమ తులు గెలుచుకున్నారు. సుర్తాని నిషిత్ కుమార్ మొదటి బహుమతిగా ల్యాప్ టాబ్, వేదకార్తికేయ ట్యాబ్, ప్రశంసా పత్రాలను ఏ.జి.యమ్ నర్రా శ్రీకాంత్ చేతులు మీదుగా అందుకున్నారు. ఈ విద్యార్థుల తోపాటుగా ట్యాబ్‌లు, జ్యామిట్రి బాక్స్‌లు, గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలు మిగిలిన విద్యార్థులు పొందారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జ్ఞానాన్ని పెంపొదించే శ్రీ చైతన్య విద్యా విధానాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రముఖులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చిరంజీవి, డీన్ శివయ్య, కో- ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, రేవంత్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## నాయకులు తీరు మార్చుకోండి

**ప్రజాశక్తి - పిచ్చాటూరు:** నాయకులు తీరు మార్చుకొని హుందాగా వ్యవహరించాలని, అధికారులను వేధించడం మానుకోవాలని ఎమ్మెల్యే ఆదిమూలం సూచించారు. మండల కేంద్రమైన పిచ్చాటూరు, ఎంకేటి కళ్యాణ మండపంలో మంగళవారం నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన మండల అభివృద్ధి అధికా రులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని తెలిపారు. గోకులం షెడ్లు, సబ్సిడీ రుణాలు, పశువుల తొట్టెలు అర్హత ఉన్న వారికకి అందేలా చర్యలు చేపట్టాల న్నారు. ఈ కార్యక్రమంలో పిచ్చాటూరు, నారాయణవనం, కేవిబి పురం, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాలెం, బుచ్చినాయు డు కండ్రిగ మండలాలకు చెందిన ఎంపీడీవోలు, ఏపీవోలు, ఏపీఎంలు, అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## కేన్సర్‌పై అవగాహన

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ జ్యోతి సూచించారు. మంగళవారం గూడూరు మండల పరిధిలోని నెల్లటూరులో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముందస్తు జాగ్రత్తలతో కేన్సర్‌ను జయించవచ్చన్నారు.

## లక్ష కుంకుమార్చన, శ్రీ రామ పట్టాభిషేకం

**ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి)** చంద్రగిరి గ్రామ దేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మకు మంగళవారం వైభవంగా లక్ష కుంకు మార్చన పూజ నిర్వహించారు. టిటిడి అనుబంధ దేవాలయమైన శ్రీకోదండరామస్వామి ఆలయంలో శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవం మంగళవారం కన్నుల పండుగగా జరిగింది.

In The Court of The VII Addl. District Judge : Gudur
O.S.No.6/2018
Maddali Sarvotham Reddy - Plaintiff
Vs
1. Venati Lakshmamma
2. Venati Sriram Reddy - Defendants
Notice to 2nd Defendant
Venati Sriram Reddy, S/o Indrasena Reddy, Residing at Achukatla Village, Manganellore Post, Sullurupet Mandal, Tirupathi District.
పై నెంబరున వాది పై తెలిపిన కోర్టులో ప్రతివాదులైన మీపై Specific Performance దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం తే21-04-2025 దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదారోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఎల్. రామచంద్ర రావు, బి.కాం., బి.ఎల్.,
వాది తరపు అడ్వకేట్, కోట.

In The Court of The VII Addl. District Judge : Gudur
I.A.No.356/2023
A.S.No.36/2019
Bhoompalli Venkata Reddy - Petitioner / Appellant
Vs
1. Gangireddy Padmamma and 13 others - Respondents / Respondents
Notice
To,
R12. Gangireddy Varamma, W/o Late Padmanabha Reddy, Dakshina Polam, H/o Gudali Village, Kota Mandal, Tirupathi District.
R13. Gangireddy Haritha, W/o Siva Nagaraju Reddy, 407, T.C Palya, DS Apartment, K.R. Puram, Banglore City.
R14. Gangireddy Jeevitha, W/o Neelam Krishna Reddy, Dakshina Polam, H/o Gudali Village, Kota Mandal, Tirupathi District.
పై నెంబరున పిటిషనరు / అప్పిలెంట్ పై తెలిపిన A.S.No.36/2019 లో 3వ రెస్పాండెంట్ అయిన గంగిరెడ్డి పద్మనాభరెడ్డి చనిపోయినందున, ఆయన వారసులుగా మిమ్మల్ని సమయానికి చేర్చనందులకు గాను అబేట్‌మెంటు అయినందున అబేట్‌మెంటు ఆర్డర్‌ని రద్దు చేయమని కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం తే24-04-2025 దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదారోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఎల్. రామచంద్ర రావు, బి.కాం., బి.ఎల్.,
పిటిషనర్ / అప్పిలెంట్ తరపు అడ్వకేట్, కోట.

గౌరవనీయ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి న్యాయస్థానం, తిరుపతి
ఓ.యస్.నెం.: 860/2023
కెనరాబ్యాంకు, తిరుచానూరు శాఖ, సీనియర్ మేనేజరు ప్రాతినిధ్యం ద్వారా ...వాది
V/s
1) కె.వెంకటయ్య, 2) ఎ.గంగయ్య ...ప్రతివాదులు
1టవ ప్రతివాదికి సమన్సు
కె.వెంకటయ్య తండ్రి చిన్నకాలయ్య, నివాసం డి.నెం.12/125, యస్.సి.కాలనీ, యోగిమల్లవరం, తిరుచానూరు, తిరుపతి రూరల్ మండలం
ఇందుమూలముగా మీకు తెలియజేయమేమనగా వాది అయిన బ్యాంకు తమ రుణం వసూలు నిమిత్తం పై ప్రతివాదులపై దావా దాఖలు చేసియున్నారు. గౌరవనీయ న్యాయస్థానం మీకు సమన్లు పత్రికా ముఖముగా ఆదేశించియున్నారు. కావున పై గౌరవ కోర్టులో 1టవ ప్రతివాది అయిన మీరు స్వయంగా లేదా తమ న్యాయవాది తరపున గాని తేది 06.05.2025న ఉదయం 10.30 గం॥లకు హాజరు కావలసినదిగా కోరడమైనది. అటుల హాజరుకాని పక్షములో మీ పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది 06.05.2025
(కోర్టువారి ఆదేశాల మేరకు)
గొట్టి గజేంద్ర, బి.ఎ.బి.యల్.
న్యాయవాది, తిరుపతి

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION) CUM JUDICIAL I CLASS MAGISTRATE OF PAKALA.
O.S. No: 277 /2023
Between:
Dandu Omprakash ...Plaintiff.
And:
Medasani Manohar Naidu ....Defendant.
SUIT SUMMONS TO DEFENDANT.
To, Medasani Manohar Naidu,
S/O M. Doraswamy Naidu,
Vootlavaripalli village,
Pakala Post and Mandal,
Tirupati District.
Sir
The plaintiff filed the above suit against your for recovery of amount (with regard to some cheques amount) and the same is posted to 02-05-2025 for your appearance before the above said court by 10.30 a.m. Please come on that day either in person or through your advocate and submit your objections if any. Other wise the matter will be decided exparte.
D. Subramanyam Reddy, B.A.B.L.,
Advocate for plaintifif.

IN THE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE :: PUTTUR
O. S. No. 114 / 2022
Between:
Jampuram Lakshmana Raju ...Plaintiff
And:
4. C.S.Lavanya
5. C.S.Sandhya
6. C.S.Monika ...Defendants
NOTICE TO THE DEFENDANT NO. 2
To 1. C.S.Sandhya,
D/o. Late.C.S.Sathish,
Hindu, aged about 28 years,
D.No. 13-9, Jandamanu Street,
Puttur Town and Mandal,
Tirupathi District. ...Defendant No. 2
Please take notice that the petitioner/plaintiff filed suit for permanent injunction in the above suit and the same is posted for appearance of the Defendant No. 2 on.22.04.2025 at 10.30 AM. if the Defendant No. 2 are not appear before this Hon'ble court, matter will be decide exparte and the next step will be order in this suit.
Sri. N. Nadhamuni, L.L.M,
Advocate, Puttur.

IN THE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE: PUTTUR
I.A.NO.1198/2022,
O.S.No.114/2022
Between:
Jampuram Lakshmana Raju ...Plaintiff
And:
1. C.S.Lavanya
2. C.S.Sandhya
3. C.S.Monika ...Defendants
NOTICE TO THE RESPONDENTS NO. 2
To (1) C.S.Sandhya, D/o. Late. C. S. Sathish, Hindu, aged about 28 years, D.No. 13-9, Jandamanu Street, Puttur Town and Mandal, Tirupathi District. ...Respondent No. 2
Please take notice that the petitioner/plaintiff filed I.A.No.1198/2022 permanent injunction in the above suit and the same is posted for appearance of the Respondent No. 2 on.22.04.2025 at 10.30 AM. if the Respondent No. 2 are not appear before this Hon'ble court, matter will be decide exparte and the next step will be order in this I.A.
Sri. N.Nadhamuni, L.L.M,
Advocate, Puttur.